


# 1

## పెద్దిభొట్ల సుబ్బరామయ్య

'వాన వొచ్చేట్టుంది. ఎక్కడికి ఇప్పుడు?' అంటున్నది వెనక నుంచి కోడలు.

'ఊరికే... అట్లా నాలుగడుగులు వేసివద్దామనీ..!" అంటున్నాను.

'గొడుగయినా తీసుకువెళ్లండి...'

నేను వెనుదిరిగి లోపలికి వెళ్లి గొడుగు తీసుకుని బైటికి వచ్చాను.

వీధిలోకి వచ్చి పైకి చూస్తే ఆకాశంలో మబ్బుతునక అయినా లేదు. 'పోనీలెమ్మ'ని చేతిలో గొడుగు ఊపుకుంటూ నడుస్తున్నాను. ఎదురింటివారి అమ్మాయి-అమ్మణ్ణి ఎదురై నవ్వుతూ 'తాతగారూ! గొడుగెందుకండీ చేతిలో...?' అన్నది.

'తాతగారూ' అన్న పిలుపుకు నాకు వొళ్లు మండింది.

'తోవలో వానవొస్తే.. మనవరాలా! ఏం చెయ్యాలి?' అన్నాను...

'వానా రాదు. పాడూరాదు.. తాతగారిదంతా చాదస్తం.!' అన్నది మరింతగా నవ్వుతూ.

'సరే. దీన్ని తీసుకుపోయి మా ఇంట్లో పడెయ్యి. నీ మాట కాదనడమెందుకు?' అంటూ గొడుగు ఆ పిల్లకు ఇచ్చాను. దాన్ని అందుకుని అమ్మణ్ణి వెళ్లిపోయింది. నేను ముందుకు నడిచాను. వీధి మొదట రోడ్డు అంతా దాదాపు నిర్జనంగా ఉంది. సెలవులు కావడం వల్ల అక్కడ కుర్రకుంకలు చేరి ఉధృతంగా క్రికెట్ ఆడుతున్నారు. నేనక్కడ నిలబడి చూస్తున్నాను. అందులో బౌలింగ్ చేస్తున్న కుర్రవాడు నావంక చూసి అనవసరంగా నవ్వుతూ 'వేస్తారా?' అని అడిగాడు. నేను హుషారుగా ముందడుగు వేసి 'ఇవ్వు.. వేస్తాను' అని సిద్ధపడ్డాను. వాడు బంతి అందించాడు. నేను చొక్కా చేతులు పైకి మడిచి

# శిశిరవేళ



వెనక్కు పది అడుగులు నడిచి బంతి వేసేందుకు సిద్ధపడ్డాను. బ్యాటింగ్ చేస్తున్నవాడు నిర్లక్ష్యంగా నిలబడి ఉన్నాడు. నేను వేగంగా పరుగెత్తి బంతి విసిరాను. అంతలో అంతటా నవ్వులు.. బంతి ఎటో పోయింది. కాని నా భుజం కలుక్కుమని విపరీతమైన నొప్పి పుట్టింది. పక్కన కూలబడి నాకు నేనే సపర్య చేసుకుంటే రెండు నిముషాల తర్వాత ఫరవాలేదనిపించింది. వాళ్ళు నా బాధను ఈషణ్మాత్రమూ పట్టించుకోకుండా తమ ఆట కొనసాగించారు.

నేను నీరసంగా లేచి నడిచాను.

'అరవై దాటిన తర్వాత బ్రతకడమే తప్పు' అనుకున్నాను. అందరూ అనవసరంగా 'తాతగారూ, తాతగారూ' అంటారు. అది మొదటి బాధ. ఏమి మాట్లాడినా 'చాదస్తం' అంటారు. ఒకే విషయం వాళ్లకు అర్థం కాలేదేమోనని రెండుసార్లు చెబితే 'సుత్తికొట్టాడు' అంటారు. పాత విషయాలేవైనా గుర్తు చేయబోతే 'చెప్పొచ్చావులే మహా... అంతా పాత సొద' అంటారు. ఏదైనా మాట వినబడక 'ఏమిటీ మళ్లీ చెప్పు' అన్నట్టు చూశామా, 'చెవిటిమేళం' అంటారు. పాతకాలపు ఆణిముత్యం వంటి సినిమా పేరు ఏదైనా ఎత్తితే 'బోరుబోరు' అంటారు. త్వరగా నాలుగడుగులు వేయబోతే 'నెమ్మది.. నెమ్మది ఏమిటా పరుగు?' అంటారు. నెమ్మదిగా నీరసంగా నడిస్తే 'ఇలా నత్తనడకలు నడిస్తే అయినట్టే' అనీ అంటారు. బట్టతలే అనుకోండి... చివర మిగిలిన నాలుగు పరకలూ చిరాకు పుడితే దువ్వుకుందామని దువ్వెన తీస్తే 'ముసిలాడి షోకులు చూడరా' అన్నట్టు కళ్ళతోనే సైగలు చేసుకుంటారు. ఇదంతా పెద్ద వ్యథ.

ఒకప్పుడు నేను వయసులో ఉండగా ఇప్పటివారి కంటె స్పీడుగానే ఉండేవాణ్ణి. నేనెక్కడి కయినా వెళ్లవలసివస్తే మా అమ్మ నాకు సవాలక్ష జాగ్రత్తలు చెప్పి పంపేది. 'ఎవరితోనూ అనవసరంగా తగాదా పెట్టుకోకు. ఎవరైనా ఏమైనా అంటే కూడా పట్టించుకోకు. తల వొంచుకో. రైల్లో వెళ్తున్నావు. ప్రతి స్టేషనులోనూ దిగి ప్లాట్‌ఫారం మీద షికార్లు కొట్టి కదిలే రైల్లో ఎక్కడం గొప్ప అనుకోకు. నీళ్లలో దిగకు. ఎక్కడ నీళ్లు ఎంత లోతుంటాయో ఎవరికీ తెలియదు. నీళ్లలో ఏ జలగలు, పురుగులు ఉంటాయో కూడా ఎవరికీ తెలియదు. అందుకే నీళ్లలో ఎప్పుడూ దిగకు..' అంటూ గోలపెట్టేది. ఎప్పుడయినా ఎదురు మాటాడితే 'చెప్పింది వినరా బడుద్ధాయి...' అనేది. బడుద్ధాయి అంటే అర్థం ఏమిటో అప్పుడు నాకు తెలియలేదు. ఇప్పటికీ తెలియదు. నేనెప్పుడూ ఆమె చెప్పిన జాగ్రత్తలు పాటించనేలేదు. అయితే నీళ్ల విషయంలో మాత్రం ఆమె చెప్పిన మాటలు పాటించవలసి వచ్చింది. ఇప్పటికీ నాకు నీళ్లను చూసినా, ప్రవాహాన్ని చూసినా అమిత భయం. మరీ చిన్నప్పటినుంచీ ఆ నీటి భయం అట్లా మనసులో గూడుకట్టుకుని ఉండిపోయింది. దానికి కారణం ఉంది. దాన్ని ఎప్పటికీ మరిచిపోనూ లేను. ఎప్పటిదో ఊహ పూర్తిగా తెలియని నాటి దృశ్యం. నా కళ్లముందే నా ఈడు కుర్రవాడు నా నేస్తం- ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలోపడి నీళ్లలోపలి ఏదో అదృశ్య భయంకర జలరాక్షసి ఈడ్చుకు పోతున్నట్టు చేతులెత్తి కేకలు పెడుతూ కొట్టుకుపోయాడు. ఆ భీకర దృశ్యం నా మనసులో అచ్చుపడి పోయింది. ఇప్పటికీ నీటిప్రవాహం అంటే నా కళ్లు తిరుగుతాయి.

ఇల్లొక జైలు... చిన్నాపెద్దా ఎవరూ నాతో ఎక్కువగా మాట్లాడరు. నేనేదైనా మాట్లాడితే – ఒకటి అంటే తక్కువ – రెండంటే ఎక్కువ. నన్ను ఏ విషయంలోనూ ఎవరూ సంప్రదించరు. అప్పుడప్పుడు విసుక్కుంటూ 'నీకెందుకీ విషయాలన్నీ, ఒక మూల పడి ఉండక' అని దులిపేస్తారు కూడా. 'కాస్త పచ్చడివెయ్యి.. నంజుకుంటాను' అంటానా? 'తినండి.. ఉప్పులూ కారాలు.. నాకేం? బాధ పడేది మీరు...' అంటుంది కోడలు. నిజానికి ఆమెకు నా ఆరోగ్యం ప్రధానమని నేననుకోను. నన్ను మాటలతో బాధ పెట్టడం ఆమె నైజం. కొడుకు వెధవ కూడా ఆమెనే సమర్థిస్తాడు. 'ఏం? కారం తగ్గితే ముద్ద దిగదా?' అంటాడు. 'కాఫీ చేదు.. కాస్త పంచదార వెయ్యి' అంటానా? ఇక చచ్చానే. క్లాసు పీకుతారు అందరూ చేరి. పీకి పాకాన పెడతారు.

అందుకే నేనొక చిట్కా కనిపెట్టాను. ఎవరికీ తెలియనిది కాదనుకోండి.

సాయంవేళ.. 'అట్లా నాలుగడుగులు వేసి వొస్తాను. కాస్సేపయినా నడవకపోతే బి.పి., సుగరు కంట్రోలు కావు' అని చెప్పి బయలుదేరడం.. సిటీబస్సెక్కి వస్టపుస్లో దిగడం.. అక్కడి పాత కాలపు చిన్న హోటల్లో ఒక మూలగా సెటిల్ కావడం.. ముందు ఒక స్వీటు.. ఆ




కార్టూన్ల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కార్టూన్

వినోద్.

తర్వాత మస్తుగా జీలకర్ర, అల్లం, మిర్చితో ఒక పెసరట్టు లాగించడం.... పుష్కలంగా చక్కెర వేయించుకుని కాఫీ తాగడం... తర్వాత ఏమీ ఎరగనట్టు ఇంటికి చేరుకోవడం... దీన్తో ప్రాణానికి హాయిగా ఉంటున్నది. గొప్ప థ్రిల్‌గా కూడా ఉంటున్నది.

ఇవాళ గొడుగు ఆ పిల్లచేతికి ఇచ్చి బయలుదేరానా? చేతులూపుకుంటూ బస్టాపు దగ్గరికి వచ్చేసరికి బస్సు కంటె ముందు ఆకాశంలో దండయాత్రకు సిద్ధమైనట్టు గర్జిస్తూ భీకరంగా మేఘాలు గుమికూడాయి.

బస్సులో ఎక్కగానే ఒక అపరత్యాగరాజు. 'తాతగారూ. కూర్చోండి' అని తాను లేచి నాకు సీటు ఆఫరు చేశాడు. వాడి వంక కృతజ్ఞతాపూర్వకంగా కాకుండా గుడ్లురిమి కోపంగా చూస్తూ కూర్చున్నాను. అప్పుడే జల్లు మొదలయింది. వర్షంలో బస్సు దిగక తప్పదు కదా! నిలువెల్లా తడవకనూ తప్పలేదు. హోటల్లో నిలువెల్ల నీళ్లు కారుతూ ఒక మూల కూలబడ్డాను. ఆ అల్లరి పిల్ల చెబితే మటుకు నా బుద్ధి ఏమయింది? గొడుగు ఎందుకు ఇచ్చేయాలి? అదేమి బరువైన వస్తువా? ఉంచుకుంటే పోయేది. ఒక స్వీటు ఆర్డరిచ్చి ఎదురుచూస్తూ కూర్చున్నాను. స్వీటు రాగానే ఆ ప్లేటు ముందుకు లాక్కోబోతూ ఉండగా మబ్బులేని పిడుగొకటి పడ్డట్టయింది. 'నాన్నా! ఎందుకిలా వొచ్చావు? ఇక్కడేం పని పడింది నీకు?' అంటూ మావాడు తన సహోద్యోగుల గుంపుతో వచ్చిపడ్డాడు. 'నువ్వెందుకు ఈ టైములో ఆఫీసు నుంచి వొచ్చావు..?' అని నేను ఎదురు ప్రశ్న వేశాను. ఆ గుంపులో ఒక బడుద్దాయిగాడి పుట్టిన రోజట నా ఖర్మ కాలి. స్వీటు చేతికందేంత దూరంలో నోరూరిస్తున్నది. కాని ఏం లాభం? పెద్దగా 'సర్వర్! ఒక కాఫీ సుగర్‌లెస్' అని అరిచాను. ఆ పుట్టినరోజు పార్టీ మొదలుకానేలేదు. ఎప్పటికి పూర్తవుతుందో' మనసు విరిగిపోయింది. నిట్టూర్చి లేచాను. విసవిసనడిచి ఇవతలికి వచ్చాను.

'జీవితం ఇంతే...' అని నన్ను నేను తిట్టుకుంటూ బైటికి వచ్చి నడవడం మొదలుపెట్టాను. మాటిమాటికీ 'ఈ జీవితం ఇంతే' అని అష్టోత్తరశతం లాగా మనసులో అనుకున్నాను. మళ్ళీ బస్సెక్కి ఇంటి ముందుకు వచ్చి ఆగాను. ఎదురింటి అమ్మడు-అమ్మణ్ణి తమ అరుగుమీద హాయిగా కూర్చుని ఉండి ఏదో స్వీటు కాబోలు తింటూ నవ్వుతూ 'వానలో బాగా తడిసినట్టున్నారే తాతగారు..' అన్నది. నాకు వొళ్లు మండింది. 'తడిశారా?' అన్నందుకు కాదు. మళ్లీ 'తాతగారూ' అన్నందుకు.....

(ఆకాశవాణి సౌజన్యంతో..)

# అనుకోని మలుపులు

## డా॥ సి. నారాయణరెడ్డి

ఇప్పుడీ చైతన్యం గుప్తంగా ఉంది
కాలవల్మీకంలో ఆవులిచ్చిన భుజంగంలా ఉంది.
రోజు రోజుకూ
ప్రతికూల పరిసరాలు విషమిస్తూ ఉంటే
అది పడగెత్తి పైకి లేచి కస్సున
కాటేసి తీరుతుంది.
కెరటాల స్వరాలతో
నిత్యం నేలకు జోలలు పాడే
సాగర మాతృక కడుపు మండిందా
చెలియలికట్టను తెంచుకుని ఉప్పెగా విజృంభించి
చేలనూ ఊళ్ళనూ కబళించి వేస్తుంది.
పచ్చదనాన్ని తన ఒడినిండా నింపుకున్న కారడవి
మనసు రగిలితే
రాత్రికి రాత్రే ప్రళయాగ్ని మూర్తిగా మారి
సమస్త వృక్షరాశిని భస్మం చేస్తుంది.
దప్పితో విలవిలాడే ధరిత్రి ఆర్తనాదం విని
జలదానం చేసే కరుణామయి మేఘం
వికటించే వాతావరణం తన రొమ్మును కుమ్మితే
కణకణలాడే పిడుగులను వర్షిస్తుంది.
సృష్టిలో దేనికైనా ఓ హద్దుంది.
ఎల్లలు దాటితే ఏదైనా అనుకోని మలుపులు
తిరుగుతుంది.
సహజరీతిలో సాగిపోయే ఊపిరిని
మరీ మరీ బిగించి వేస్తే
అది నడిమికి పుటుక్కున తెగిపోయి
ప్రాణాలు హరించుకుపోయే దశకు దారి తీస్తుంది.
ఎత్తుగద్దెలకు అంటుకుపోయిన పాలకవర్గాలు మతి
తప్పి
తమ తలలను అణగదొక్కుతూ ఉంటే
సహనం కోల్పోయిన పీడితగణం తిరగబడి
పరపీడనలకు మరిగిన ఆ వర్గాలను కిందికి లాగి
అట్టడుగుకు తోసేస్తుంది.
ప్రకృతిలోనైనా
ప్రజాజీవన రంగంలోనైనా
మలుపులు తిరిగే అనూహ్య పరిణామాలను
పాఠాలు అధ్యయనం చేస్తే
సార్వజనీన సంక్షేమం సమశ్రుతిలో పలుకుతుంది.